ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 24 సంచిక : 08 ఏప్రియల్ 2019



రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ|| 150/-

విడి ప్రతి : రూ|| 12/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977


ఈ సంచికలో....

05-05-1985

జిన్నూరు


ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-05-1985, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

గోలక్ష్మి (ఆవు) తన మూడు దూడలతో వచ్చి హాల్లో భగవాన్ సోఫా ప్రక్కన పడుకుంది. దానిని చూచి భగవాన్ అన్నారు, ఇన్నాళ్ళూ లక్ష్మి స్వామిని వదిలిపోవాలని సాయంత్రం ఏడుస్తూనే ఇంటికి వెళ్ళేది, చివరకు ఈవేళ తన సొంతింటికి వచ్చి చేరుకున్న సంతోషంతో పడుకుంది. అంటే మన సొంతఇల్లు ఆత్మ. ఆ సొంతింటికి వెళ్ళే వరకూ ఎన్ని శరీరాలు మారాలో, ఎన్ని కొంపలు మారాలో? ఓ మనస్సా! ఇలా దేశాల వెంటపడి ఎంతకాలం తిరుగుతావు, నీ స్వగృహమునకు పొమ్ము అన్నారు వివేకానందస్వామి. మన స్వగృహము ఆత్మ.

మనం మనుషులము. బడిలో, కాలేజీలో చదువుకున్నాము, పుస్తకాలు చదువుతున్నాము, చిలుకపలుకలు పలుకుతున్నాము కానీ శరణాగతి చెయ్యలేకపోతున్నాము. లక్ష్మి ఆవు, మనం మనుషులం. కానీ లక్ష్మి తన భారం భగవాన్ మీద వేయగలిగింది. మనం భారం వేయలేకపోతున్నాము. బహుశా మనకి మనస్సు అడ్డు వస్తోంది, అహంకారం అడ్డు వస్తోంది, తెలివితేటలు అడ్డువస్తున్నాయి. లక్ష్మి జంతువే అయినా తన భారం వెయ్యగలిగింది, భారం వేసిన మూలాన శరణాగతి పొందింది. నేను నా బిడ్డలు నీకు శరణాగతి, ఇక మా భారం నీదే అని పడుకుంది అన్నారు భగవాన్. తన భారం అంతా ఈశ్వరుడి

మీద పెట్టటానికి పూర్వజన్మల నుండి ఎంత కష్టపడిందో లక్ష్మి! మీరందరూ భగవాన్ మార్గంలో ఉన్నారు, ఏమో పూర్వజన్మలలో మీరుచేసిన కృషి ఏమిటో మీకేమి తెలుసు? మీరు మంచి కృషి చేసారు, కానీ చేసింది మరిచిపోయారు. మంచి కృషి చెయ్యకపోతే భగవాన్ మార్గంలోకి మీరు ఎలా వస్తారు? మీరు చేసింది మరిచిపోయారు కానీ అది వాసన రూపంలో మిమ్మల్ని ఇక్కడికి తీసుకొని వచ్చింది. మీరు పూర్వజన్మలో కృషి చేసి ఉండకపోతే, మీరు భగవాన్‌మార్గంలోకి రారు.

నాకు అన్నీ బాగున్నాయి, ఇక ఆత్మ తృప్తే కావాలి, ఆత్మదర్శనం అయ్యేలాగా ప్రసాదించండి స్వామీ అని ఎవరో ఒకరు భగవాన్‌ని అడిగారు. భగవాన్ సోఫాలోంచి నుంచుని ఆయన చేతులు పట్టుకొన్నారు. ఇద్దరూ నిశ్చలంగా నించున్నారు చాలాసేపు. చివరికి ఆ స్వామి తృప్తి అయ్యింది అని వెళ్ళిపోయారు. ఈవిధంగా స్పర్శతో, మాటతో, మౌనంతో, చూపుతో ఎందరినో అనుగ్రహించారు భగవాన్. మీ మనస్సు పూర్తిగా అణిగినప్పుడు తెలుస్తుంది ఈ మాటలలోని తీయదనం. మనకి గర్వాలు రావటానికి కారణం డొమెస్టిక్ లైఫ్. కుటుంబజీవితంలో మనకి గర్వాలు వస్తాయి. వాళ్ళు ఇంత గొప్పవాళ్ళు, వీళ్ళు అంత గొప్పవాళ్ళు, ఇలా కుటుంబజీవితాన్ని అహంకారంతోటి కొలుచుకుంటారు. దానివల్ల లోపలినుంచి పొగరుబోతుతనం వస్తుంది, అహంకారం పుడుతుంది. బంధువులను భగవంతుడు ఇస్తాడు, స్నేహితులను మనం ఎన్నుకోవాలి అని ఒక ఇంగ్లీషు కవి చెప్పారు.

సూర్యనారాయణరాజుగారు మొన్న ఒక ప్రశ్న అడిగారు. భగవాన్ నేను ఎవడిని నేను ఎవడిని అంటున్నారు ఏమిటి అని? మా బద్రిరాజు బద్రిరాజు గారు కూడా అనేవారు ఇదేంటండీ ఈ నేను ఎవడిని ప్రశ్న ఏమిటి అని. ఏదో రామా కృష్ణా అనుకుంటే బాగుంటుంది, ప్రార్థనలు చేయండి భజనలు చేయండి అంటే మాకెంతో బాగుంటుంది. దీనికి పని చెప్పనక్కరలేదు. దీనికి పని చెప్పేటప్పుడు వస్తుంది మనకి తంటా అంతా! ఇక్కడ మీరొకటి ఆలోచించాలి. నేను ఎవడను అనే ప్రశ్న ఏమిటి? నేను నేను అని మనం అందరం అంటున్నాము. ఇందులో సందేహం ఉందా? సందేహం లేదు. మీరు నేను నేను అంటున్నారు

కదా ఆ నేను ఎవరో ప్రశ్నించమంటున్నారు భగవాన్. నేను అని మనస్సు అంటోంది, శరీరం అనటం లేదు, అలా అయితే శవం కూడా నేను అనాలి. నేను అని లోపల మనస్సు అంటోంది. శివా అన్నా, రామా అన్నా, కృష్ణా అన్నా, మనస్సు అంటోంది. ఇక్కడ మనం గ్రహించవలసినది ఏమిటంటే లోపల ఉన్న ఆనందాన్ని మన అందుబాటులోకి రాకుండా, సుఖాన్ని మన అందుబాటులోకి రాకుండా, మన స్వరూపాన్ని మనకి తెలియకుండా చేసేది ఈ మనస్సు. ఈ కిటుకు మీకు బాగా అర్థం అవ్వాలి. మన లోపల ఉన్న సుఖాన్ని మనకు అందుబాటులోకి రాకుండా, మన లోపల ఉన్న శాంతిని, మన లోపల ఉన్న ఆనందం, మన స్వరూపం మనకి తెలియకుండా మన మనస్సు అడ్డు వస్తోంది, మన శరీరం అడ్డు రావటం లేదు. మనం ఈ అడ్డం వచ్చే మనస్సుతోటి రామా అంటున్నాం, శివా అంటున్నాం, కృష్ణా అంటున్నాం. ఈ మనస్సు ఏం చేస్తోందంటే, పోనీ రామా అనమంటే అందాం, శివా అనమంటే అందాం, కృష్ణా అనమంటే అందాం, మన గొడవ జోలికి వీళ్ళు రావటం లేదు. ఎవళ్ళో పేర్లు అనమంటున్నారు, పోనీ అందాము. కృష్ణా అని, రామా అని, శివా అని అనమంటే అంటోంది. మరి ఆ కృష్ణుడు ఎవరు? రాముడు ఎవరు? శివుడు ఎవరు? కృష్ణుడు అంటే శరీరమా, కాదు; రాముడు, శివుడు శరీరము కాదు; అయితే వాళ్ళు మనస్సా, కాదు. వాళ్ళు ఆత్మ స్వరూపులు. ఆత్మ మన స్వరూపంగానే ఉంది. నామం చేస్తున్నారు, ఆ నామం చేసేవాడు ఎవడు? నామం మనస్సు చేస్తోంది. ఎవరి నామం చేస్తోంది? దేవుడి నామం చేస్తోంది. రాముడు నామమో, కృష్ణుడు నామమో, శివుడి నామమో చేస్తోంది. మీరు ఇదే బాగా అర్థం చేసుకోవాలి. వాళ్ళు ఎవరు? వాళ్ళు కూడా మనలా దేహమా? రాముడు అంటే రాముడి దేహమా మీరు స్మరించేది? రాముడు ఎవరు? ఆత్మ. ఆత్మ ఎక్కడ ఉంది, మీ లోపలే ఉంది. ఇక్కడ మీరు బాగా అర్థం చేసుకోండి. నేను ఎవడను అంటే, మీరు మీ మనస్సునే ప్రశ్న వేస్తున్నారు. ఇక్కడ అది ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ మనస్సు రామా అనమంటే అంటుంది, భజన చెయ్యమంటే చేస్తుంది, సంతర్పణ చెయ్యమంటే చేస్తుంది, లక్షవత్తుల నోము నోయమంటే నోస్తుంది. పూజ చేయమంటే చేస్తుంది, దానం చేయమంటే

చేస్తుంది, కానీ దాని జోలికి రావద్దు అంటుంది. ఎందుకంటే అది మనం అనుకుంటున్నాం కాబట్టి దాని జోలికి రావద్దు అంటుంది. ఇక్కడ భగవాన్, నేను ఎవడను అనే ప్రశ్న ద్వారా దాని అస్తిత్వాన్ని ప్రశ్నించమంటున్నారు. నేను అని మనస్సు అంటోంది. ఈ మనస్సు అణిగేవరకు నేను ఎవడను అనే ప్రశ్న అలా వేస్తూ ఉండమంటున్నారు. నేను నేను అంటే కంగారు పడకండి, మనస్సే అంటోంది నేను నేను అని, శరీరం కాదు. ఆత్మ నేను అనదు, ఆత్మకి ద్వైతం లేదు. శరీరం నేను అనదు. ఎవరు అంటున్నారు నేను అని, మన మనస్సు అంటోంది.

ఈ మధ్య మనస్సు కుదురుగా లేదు అంటారు. ఇవి అన్నీ మనస్సే చేస్తోంది. వాడు ఎవడో తెలుసుకోవాలి. వాడు ఎవడో తెలియనంతకాలం వాడి మూలం మీకు తెలియనంతకాలం లోపల ఉన్న అజ్ఞానం తెగదు. దీనికి భగవాన్ ఏమన్నారంటే, మీ మనస్సు ఎవరో ప్రశ్నించకుండా, మీ మనస్సు యొక్క అస్తిత్వాన్ని ప్రశ్నించకుండా ఈ మనస్సు యొక్క ఉనికిని ప్రశ్నించకుండా, మనస్సుతోటి ఏదో రూపాన్ని సృష్టించుకొని, మీరు ఏదో చేస్తూ ఉంటే, దొంగవాడికి పోలీసు వేషం వేసినట్టు అవుతుంది. దొంగవాడికే పోలీసు వేషం వేసి ఆ వస్తువుని వెదకమనటం ఎటువంటిదో, మన మనస్సుని అడగటం కూడా అటువంటిదే అన్నారు. మనస్సు ఏంచేస్తుందంటే, నేను అందంగా ఉన్నాను, నేను లావుగా ఉన్నాను, నేను ధనవంతుడిని, నాకు అధికారం ఉంది, ఇలా అన్నిటితో కలుస్తూ ఉంటుంది. దీనివల్ల అది చిక్కబడుతుంది. చిక్కబడేకొలదీ ప్రమాదం ఏంటంటే, అహంకారం పెరుగుతుంది. ఈ శరీరాన్ని నేను అంటోంది కదా, ఈ శరీరంతో కలిసి ఉంటుంది, కాబట్టి చచ్చిపోతాం అనే భయం వేస్తోంది. ఎందుకంటే శరీరం నేను అనుకొంటున్నాము కాబట్టి. హూస్ బాడీ ఈజ్ దిస్? ఎవడిది ఈ శరీరం? మనలో అహంకారానికి శరీరం కావాలి, ఆత్మకి శరీరం అక్కరలేదు. అహంకారానిదే ఈ శరీరం, నాలో ఆత్మకి శరీరం అక్కరలేదు అని మీరు ఎలా చెప్పగలరు అంటే, నిద్రలో మనకి శరీరం గొడవ లేదు. మెలకువ వచ్చాక శరీరం గొడవ వస్తోంది. ఎందుకంటే నిద్రలో అహంకారం అణిగి ఉంటుంది, మెలకువలో అహంకారం

లేస్తోంది. అప్పుడు శరీరం నాది అనిపిస్తోంది. శరీరం లేకుండా, తలంపులు లేకుండా, లోకం లేకుండా, మీరు నిద్రలో ఉన్నారా లేదా? నేను అనేది మొదటి తలంపు. దాని యొక్క మూలం నీలోపలే ఉంది. నేను అనే మొదటి తలంపుని పట్టుకొని, దానిని వెంటాడుతూ లోపలికి వెళితే, అది ఆత్మ దగ్గరికి తీసుకొని వెళుతుంది, మీ స్వరూపం దగ్గరికే తీసుకెళ్తుంది. అది మీ హృదయంలోంచి వస్తోంది. మీరు బాగా ఆలోచించండి, మీరు నేను నేను అంటున్నారు; ఆ నేను అనే తలంపు మీ లోపల నుంచి వస్తోంది. ఈ నేను అనే స్ఫురణ లోపలి నుంచి వస్తోంది కాబట్టి లోపల ఎక్కడో దానికి ఒక ప్లేస్ ఉంది. ఆ ప్లేస్ ఏంటో తెలిస్తే మీ అజ్ఞానం పడిపోతుంది. అహంకారానికి తలంపులే మేత. శరీరానికి తిండి మేత, అహంకారానికి తలంపులు మేత, రాగద్వేషాలు తగ్గించుకోమని భగవంతుడు చెప్పాడు. ఎందుకంటే రాగద్వేషాలు పెరిగితే అహంకారం చిక్కబడుతుంది. అవి తగ్గితే అహంకారం పలచబడుతుంది. భగవాన్ 'నేను ఎవడను?' లో కూడా చెప్పారు, ఎదుటి మనిషి ఎంత దుర్మార్గుడు అయినప్పటికీ, ఎదుటివాడు ఎంత చెడ్డవాడు అయినా, వాడి మీద ద్వేషం పెట్టుకోవద్దన్నారు భగవాన్. ఎందుకంటే వారి మీద ద్వేషం పెట్టుకుంటే మీకే నష్టం. మీ మనస్సు బహిర్ముఖం అయిపోతుంది. మోక్షం మనలోనే ఉంది. ఈ అహంకారం అనే మూత తొలగించటమే మనం చెయ్యవలసిన పని. అంతకంటే ఇంకేమీ చెయ్యనక్కరలేదు.

కొంతమంది మాకు ఏదో వెలుగు కనిపించింది, రూపాలు కనిపించాయి అంటారు. కనిపించిన మాట నిజమే, ఆ చూచేవాడు ఎవడు? ఏమి చూస్తున్నారు అని కాదు. చూసేవాడు మనలో ఉంటేనే ఇవి అన్నీ కనబడుతున్నాయి. వాడు లేకపోతే ఏమీ కనబడవు. ఇదంతా ద్వైత దృశ్యం. ధ్యానం అనేది చాలా గొప్ప స్థితి అనుకొంటాము జనరల్‌గా. ధ్యానం చేసేటప్పుడు మూడు ఉండాలి. ధ్యానంచేసే మీరు ఉండాలి, ధ్యానం చేయటానికి ఏదో రూపం ఉండాలి, ధ్యానం చెయ్యటం అనే పని. ధ్యానం మనస్సు చేస్తుంది, ఏదో రూపాన్ని, రాముడినో, కృష్ణుడినో, శివుడినో ఎవరో ఒకరిని ధ్యానం చేస్తారు. ధ్యానం చెయ్యటం

అనేది ఒక పని. మూడు అయ్యాయి. అసలే మనస్సుని జయించటం ఎలా అని మనం చూస్తూ ఉంటే, ఈ మనస్సు అప్పడే మూడు సృష్టించింది. అసలు ఉన్నది ఒకటి, మూడు క్రింద మార్చింది మనస్సే. ధ్యానం చేస్తున్నారు కదా, జపం చేస్తున్నారు. ఈ ధ్యానం చేసేవాడు జపం చేసేవాడు ఎవడు? ఈ ప్రశ్నలు వేసుకోవటం వల్ల మనస్సు లోపలికి దిగుతుంది. మన మనస్సు అమెరికా వెళ్ళమంటే, వెళ్ళి వచ్చేస్తుంది. లోపలికి వెళ్ళమంటే ఒక్క అంగుళం దిగదు. మీరు వంద ఏళ్ళు జీవిస్తే, ఈ వంద ఏళ్ళలో మీ మనస్సును ఒక్క అంగుళం లోపలికి పంపటానికి ప్రయత్నం చెయ్యండి. మీరు నూరు సంవత్సరాలూ జీవించండి, మధ్యలో వెళ్ళిపోవద్దు. మీరు ధ్యానం చెయ్యండి, పూజలు చెయ్యండి, మీకేది ఇష్టం అయితే అది చెయ్యండి. కానీ మీ మనస్సుని ఒక్క అంగుళం లోపలికి పంపండి. మన మనస్సు కూడా కల్పితమే. మనకున్న వాసనలు, తలంపులు, మన కాంక్షలు, మనస్సు కింద గడ్డకట్టుకొని పోయింది కానీ, నిజంగా మనస్సు అనేది లేదు.

కొంతమంది నవ్వు స్వీట్‌గా ఉంటుంది. కొందరు నవ్వితే లోపలినుంచి విషం బయటికి వస్తుంది. కొంతమంది మన వంక చూస్తే మన హృదయంలో ఉన్న రాళ్ళు బయటికి పోతాయి. కొంతమంది మనని చూస్తే మనని శపిస్తున్నారా, మనని అగ్నిలో పడేస్తారా అనిపిస్తుంది. చూపులో తేడా ఉంది, మాటలో తేడా ఉంది, తలంపులో తేడా ఉంది, నవ్వులో తేడా ఉంది. మనిషి జీవితం యొక్క సారం అంతా కూడా మీ హృదయంలో ఉంది. మీకున్న సంతోషాలు, దుఃఖాలు మీ చేతులలో మీ కాళ్ళలో లేవు, మీ హృదయంలో ఉన్నాయి. మానవజాతి చరిత్ర అంతా కూడా హృదయంలోనే ఉంది. మీ రహస్యాలు మీ హృదయంలో ఉన్నాయా; మీ ఇంటిలో ఉన్నాయా? మీకు పది అంతస్తుల మేడ ఉందనుకోండి, మీ రహస్యాలు మీ మేడలో పెట్టుకుంటారా, మీ హృదయంలో పెట్టుకుంటారా? చాలా అవయవాలు ఉన్నాయి కదా, హృదయమే అని ఎందుకు చెపుతున్నారు? మనకి వచ్చే కోరికలు తలంపులు అన్నీ కూడా హృదయంలోంచే వస్తున్నాయి. గత జన్మల యొక్క అనుభవాలు, ఈ లోకాల యొక్క అనుభవాలు, సమస్తం; మానవజాతి, సృష్టి యొక్క రహస్యం

అంతా కూడా హృదయంలోనే ఉంది. మీకేమైనా కోరికలు వస్తే, మీ ఇంటిలోంచి కోరికలు వస్తున్నాయా, లేకపోతే మీ హృదయంలోంచి కోరికలు వస్తున్నాయా? మీ కష్ట సుఖాలు, మీ హృదయంలో దాచుకొంటున్నారు, ఇంటిలో కాదు. జీవితసారం మీ డబ్బులో లేదు, చదువులో లేదు, ప్రపంచంలో లేదు, శరీరంలో లేదు, మన హృదయంలో ఉంది. మనం ఇనుప పెట్టిలో డబ్బు దాచి అవసరమైనప్పుడు తీసుకుంటాము. అదేవిధంగా మన తలంపులు, ఊహలు, ఆలోచనలు అన్నీ హృదయంలో ఉన్నాయి, అందులోంచి ఒక్కో తలంపు ఆలోచన వస్తూ ఉంటాయి బయటికి. అసలు మనకి తెలియనివి ఎన్నో ఉన్నాయి. ఫలానా తలంపు మన హృదయంలో ఉంది అని తెలియనివి కూడా ఎన్నో మన హృదయంలో ఉన్నాయి. వాసుదేవస్వామి గీతలో చెప్పాడు - అదంతా ఒక్కసారి నువ్వు భరించలేవు. గడ్డిమేటు ఎంతపెద్దదైనా, ఒక అగ్గిపుల్లకి లోకువ. ఇక్కడున్న కర్మ, నువ్వు పోగుచేసుకున్న వాసనలు, చూస్తే కొండలంత ఉన్నాయి, పర్వతాలంత, పెద్ద పెద్ద గడ్డిమేటులు ఉన్నాయి. వాటిని లెక్కపెట్టి, ఒక్కొక్కటి బయటికి తీయటం నీ వల్ల కాదు. జ్ఞానం అనే రవ్వ, జ్ఞానం అనే అగ్గిపుల్ల వల్ల మొత్తం అంతా భస్మం అయిపోతుంది. మనం చేసిన పనులు, విన్న విషయాలు, చూసిన సంఘటనలు, అన్నీ మర్చిపోయాం కానీ అవి అన్నీ తలంపుల రూపంలో మన హృదయంలో దాగి ఉన్నాయి. జ్ఞానం అనే అగ్గిపుల్ల వల్ల మొత్తం అంతా భస్మం అయ్యి ఊరుకుంటుంది. మన హృదయంలో ఎటువంటి తలంపులు ఉన్నాయో మరణించేలోపున కూడా ఫలానా తలంపు ఉందని తెలియకపోవచ్చును. ఈ భూమి ఉంది, లోపల భూమిలో విత్తనాలు ఉంటాయి, అవి మొక్క మొలిచేవరకూ ఏ విత్తనం ఉందో తెలియదు. లోపల ఉన్న వాసన మనకి తలంపు రూపంలో వచ్చినప్పుడు ఈ వాసన ఉందని మనకి తెలుస్తుంది. కానీ అసలు తలంపు రాకపోతే అదికూడా తెలియదు, ఆ వాసన ఉన్నట్టు కూడా తెలియదు. అందుచేత భగవాన్ చెప్పారు, ఎన్ని వాసనలు అయినా రానీ, ఎన్ని తలంపులు అయినా రానీ, ఉన్నాయి కాబట్టి వస్తున్నాయి. నీకు తెలియాలి కదా అవి బయటికి పోవాలంటే. స్వామీ ధ్యానం చెయ్యటానికి కూర్చుంటున్నాము, పూజ చెయ్యటానికి కూర్చుంటున్నాము,

ఎక్కడలేని గొడవలు వచ్చేస్తున్నాయి మీదకి అనేవారు భగవాన్‌తో. నిజమే ఉన్నాయి కాబట్టి వస్తున్నాయి, రానియ్యి అనేవారు. లోపల ఉన్న విత్తనం మొక్క రూపంలో బయటికి వస్తే అప్పడు వేరుతో సహా బయటికి తీయవచ్చు. విత్తనం ఉందని నీకే తెలియనప్పడు నువ్వు ఎలా తీయగలవు అన్నారు.

జీవితంలో ఏదైనా కష్టపడ్డ వాడికి మన కష్టం గురించి చెప్పకుంటే వాడికేమైనా అర్థం అవుతుంది. కానీ అసలు కష్టం ఎలా ఉంటుందో తెలియని వాడి దగ్గర మనం కష్టం చెప్పకుంటే వాడికి ఏమి తెలుస్తుంది? మన కష్టం అర్థం చేసుకోవడానికి వాడు కూడా ఎంతో కొంత కష్టపడి ఉండాలి జీవితంలో. అసలు కష్టం తెలియని వాడికి ఏమి అర్థం అవుతుంది? వాడికి చెప్పినా స్తంభానికి చెప్పినా ఒక్కటే. బళ్లో పిల్లలు చదువుకొంటారు, వాళ్ళు తహసీల్దారులు కలెక్టర్‌లు అవుతారు. ఈ మాష్టారు చెప్పే పాఠం బడిలో ఉన్న గోడ కూడా వింటూనే ఉంటుంది, కానీ గోడ గోడలాగే ఉంటుంది, అది తహసీల్దారు, ఇంజనీరు అవ్వదు. లోపలి నుంచి ఆ తపన ఏది? మిమ్మల్ని ఏ కర్మ తీసుకొచ్చింది ఇక్కడికి, ఎవరైనా బలవంతాన పంపితే ఇక్కడికి వస్తున్నారా? ఎవరు తీసుకొచ్చారు మిమ్మల్ని ఇక్కడికి, ఏ సుకృతం మిమ్మల్ని తీసుకొచ్చింది ఇక్కడికి? డాక్టరుగారు ఎక్కడో పందలపాక నుంచి కాపురంతో సహా వచ్చేసారు ఇక్కడికి. కాపురంతో సహా జిన్నూరు వచ్చారు అంటే, ఎవరు తీసుకొచ్చారు? చాలామంది తెలియనివాళ్ళు వెంకటరామరాజుగారి గురించి వచ్చేసారు అనుకొంటున్నారు. వెంకటరామరాజుగారంటే ఈ శరీరం చెప్పిందా, ఈ అహంకారం చెప్పిందా? ఈ శరీరం వల్ల, మనస్సు వల్ల వచ్చేసారు అనేది అబద్ధం. అది ఈశ్వరుని యొక్క ప్రణాళిక! నా వల్ల రావటం ఏమిటి? ఈశ్వరుడు తీసుకొచ్చాడు.

కొంతమంది చూపులో కూడా చాలా దయ ఉంటుంది. వాళ్ళు చూస్తే మన కష్టం అంతా పోతుంది. ఒకళ్ళు చూస్తే, ఆ చూపు మనల్ని జన్మజన్మలు తరుముకొస్తుంది, మనని పట్టుకొని వేధించేస్తుంది. కొంతమంది మనుషులు మన వంక చూస్తే ఆ చూపు మనం ఇంటికి వెళ్ళిన తరువాత కూడా పట్టుకొని కాల్చేస్తుంది. దయలో తేడా ఉంది, చూపులో

తేడా ఉంది, కరుణలో తేడా ఉంది, మాటలో తేడా ఉంది. మాట ఎక్కడనుంచి వస్తోంది, మాట హృదయంలోంచి వస్తోంది, చూపు హృదయంలోంచి వస్తోంది, దయ హృదయంలోంచి వస్తోంది - అక్కడ హృదయం ప్రధానం. మీ చుట్టూ ఉండటానికి నోచుకున్న భక్తులు అందరూ ప్రతినిమిషం మీ సాన్నిధ్యం అనే అమృతమును రుచి చూస్తూ ఉంటారు. ఎంతో దూరంలో ఉన్న ఈ దాసుడు జ్ఞప్తిలో ఉంటాడా? భాగ్యమంటే వీరిది. నన్ను కూడా నీ మనస్సులో ఏ మూలో ఉంచుకొని సదా రక్షించాలి అని ప్రార్థిస్తున్నాను అని ఒకతను భగవాన్‌తో అన్నాడు. ఆ ప్రార్థనకి భగవాన్ అన్నారు, నీ ప్రార్థన సరే, ఇతడు ఎక్కడో ఉన్నాడు, అతనిని రక్షించాలి అనే తలంపు ఉంటే, అతను జ్ఞాని ఎలా అవుతాడు? మనస్సే లేని వాడు దేనిని కానీ ఎట్లా మనస్సులో ఉంచుకోగలడు? మన మనస్సుని పరిశుద్ధంగా ఉంచుకుంటే మీకు జరగవలసిన కార్యక్రమం అంతా సజావుగా జరిగిపోతుంది. మీరు మనస్సుని శుద్ధంగా ఉంచుకుంటే, మీకు సాధన జరిగిపోతుంది, మీకు ఏ లోటూ రాదు. ఎదుటివాళ్ళు మిమ్మల్ని ఏదైనా అనుకొంటున్నారేమో అనే మీకు భయం పుడుతోంది అనుకోండి, ఏదైనా అనుకుంటే మీకు కంగారు పుడుతోంది అనుకోండి మాటవరసకి, వాళ్ళు మీ గురించి ఏదైనా అనుకుంటూ ఉంటే, మీ ప్రారబ్ధాన్ని వాళ్ళు పంచుకొంటున్నారు మీకు తగ్గిపోతుంది కదా! ఇది ఋణానుబంధం! ఎదుటివాళ్ళు ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తున్నారు అనుకోండి, మీరు అనుభవించాల్సిన ప్రారబ్ధాన్ని వాళ్ళు పంచుకొంటున్నారు. మీకు పాపం తగ్గిపోవటం మంచిదే కదా! మీ గురించి మీకు అవగాహన లేకుండా, మీ గురించి మీకొక అభిప్రాయం లేకుండా, ఎదుటివాళ్ళు ఏమనుకొంటున్నారు, అని ఎదుటి వారి భావాలకు కనుక మీరు గౌరవం ఇస్తూ ఉంటే, మీ మీద మీకు విశ్వాసం లేనట్టు అర్థం. మీ మీద మీకే విశ్వాసం లేనప్పుడు దేవుడి మీద విశ్వాసం ఎలా కలుగుతుంది?

గురువు చుట్టూ ఉంటూ ఎప్పుడూ అతనిని సేవించుకునే భక్తులకి ఏదో ప్రత్యేకమైన అనుగ్రహం లభిస్తుంది అని అందరూ అనుకొంటారు. అట్లాంటి ప్రత్యేకత ఉంటే, ఆ గురువు జ్ఞాని ఎలా అవుతాడు? లోకంలో ఎక్కడ ఎంత దూరాన ఉంటేనేమి, ఎవడు గురువుకి

తాను సంపూర్ణంగా అర్పించుకొంటాడో, ఎవడు సమస్తమూ గురువేనని, తానేమీ కానని అహంకారాన్ని వర్జిస్తాడో, వాడికి బహుమతి ఇచ్చేవాడు ఈశ్వరుడు. మీరు మీ గురువుని చక్కగా ప్రేమిస్తే మీ గురువు మీద కనుక మీకు విశ్వాసం ఉంటే, బహుమతి మీ గురువు ఇవ్వడు, ఈశ్వరుడు ఇస్తాడు. ఈశ్వరుడి కంటే వేరుగా ఉన్నాడా గురువు?

ఒక్కోసారి ఆత్మ అని, ఒక్కోసారి ఈశ్వరుడు అని అంటారు, ఏంటి తేడా అని మీకు అనుమానం రావచ్చు. ఉన్నది ఒక్కటే ఆత్మ, ఆత్మనే భగవంతుడు అని అంటాము. భగవంతుడి వల్ల అలా జరిగింది అండీ, వాళ్ళకి అటువంటి బాధ వచ్చింది లేకపోతే అటువంటి పుణ్యం వచ్చింది, అటువంటి సుఖం వచ్చింది, భగవంతుడు ఇలా చేసాడు అంటాము. ప్రపంచ దృష్టితోటి చెప్పినప్పుడు, ఈ ఆత్మనే భగవంతుడు అంటాము. ప్రపంచ దృష్టితోటి ఏమైనా కష్టసుఖాలు చెప్పకొనేటప్పుడు, ఈ ప్రపంచానికి సంబంధించిన పరిపాలన చెప్పినప్పుడు, ఈశ్వరుడి యొక్క సంకల్పాన్ని బట్టి అలా జరిగిందండీ అంటున్నాము. అంటే ప్రాపంచిక దృష్టితోటి మనం ఏదైనా విషయం చెప్పేటప్పుడు, ప్రాపంచిక సంఘటనలు మనకి జ్ఞప్తికి తెచ్చేటప్పుడు ఆత్మనే భగవంతుడు అంటాము లోకం దృష్టి లేనప్పుడు, భగవంతుడి దృష్టి లేదు - ఇది ఆత్మ. అంటే ఆత్మ భగవంతుడు వేరు కాదు. భగవంతుడికే కనుక మీరు నిజమైన శరణాగతి పొందగలిగితే, ప్రార్థన అక్కరలేదు, భజన అక్కరలేదు, ఈశ్వరుడే పరుగెత్తి వెళ్లి, సదా అతని వెంట ఉంటాడు. ఈశ్వరుడే వెళ్ళి శరణాగతి పొందినవానికూడా ఉంటాడు. పద్మం పక్కన కప్ప నివసిస్తూ ఉంది, ఏ దూరాన్నుంచో తుమ్మెద వచ్చి మకరందం త్రాగి వెళ్ళిపోతుంది. కప్పలు పద్మం పక్కనే ఉంటాయట, కానీ పద్మం విలువ కప్పలకి తెలియదు. దూరాన్నుంచి వచ్చిన తుమ్మెద మటుకు మకరందం త్రాగి వెళ్ళిపోతూ ఉంటుంది. యదార్థం చెప్పాలంటే, భగవాన్‌కి ఎవరిమీద అయితే ఎక్కువ కోపం వచ్చిందో వాళ్ళమీద ప్రేమ ఎక్కువ ఉన్నట్లు. ఒక్కోసారి కొన్ని జన్మలకి కానీ బయటికి పోని వాసనలు మీకు ఉంటే వాటిని తొలగించటం కోసం ఎక్కువ కోపం చూపించేవారు. ఎవరిమీద అయితే కోపం చూపిస్తున్నారో, వాళ్ళమీద అనుగ్రహం చూపిస్తున్నారు. తెలియక మన మీద కోప్పడుతున్నారు

అనుకొంటాము. మీరు ఇంట్లో పిల్లల మీద ఎప్పుడైనా కోప్పడతారు కానీ, రోడ్డు మీద పోయే పిల్లలమీద కోప్పడరు కదా. మీ పిల్లలు బాగుపడాలని కోప్పడతారు. అలాగే భగవాన్ కూడా ఎవరిమీద అయితే ఆయనకి ఎక్కువ అనుగ్రహం ఉందో, కరుణ ఉందో, వాళ్ళలో నలుసంత దోషం ఉన్నా పెద్ద పెద్ద కేకలు వేసేవారు, ఆ దోషం తీసివేయుటం కోసం. ఆ దోషం తీయలేదనుకోండి జన్మ జన్మలు పీడించేస్తుంది. రామకృష్ణపరమహంస భార్య శారద చెప్పేవారు, పెద్ద పెద్ద వాసనలు అక్కరలేదు, మీకు ఒక కూర మీద ప్రత్యేకమైన ఇష్టం ఉంటే, ఆ కూర తినాలన్న తలంపు ఉన్నా నీకు జన్మ వచ్చి తీరుతుంది అని చెప్పారు.

శరీరం, మనస్సు తేలికగా ఉండాలంటే, తమోగుణం రజోగుణం అణగాలి అని చెప్పారు. మనకి అబద్ధం నిజంలా, నిజం అబద్ధంలా కనిపిస్తోంది. దీనికి కారణం తమోగుణం, రజోగుణం. మన అందరి బుర్రలలోంచి అనేక రకాల ఆలోచనలు వస్తున్నాయి. మన బుర్రలలోంచి వచ్చే తలంపు వేరు, డాక్టరుగారి బుర్రలోంచి వచ్చే తలంపులు వేరు, పోస్ట్ మాస్టారు గారి బుర్రలోంచి వచ్చే తలంపులు వేరు, ఇన్ని బుర్రలలోంచి ఇన్ని రకాల తలంపులు వస్తున్నాయి. కానీ అందరం మనుషులమే, దీనికి కారణం ఏమిటి? అందరికీ అహంకారం ఉంది, అందరికీ అహంకారం ఉన్నప్పుడు అందరికీ ఒకే తలంపు రావచ్చు కదా! అలా రావటం లేదు. తలంపులు, ఆలోచనలు, ఊహలు, తేడాగా వస్తున్నాయి. దీనికి గుణాలు కారణం. సృష్టిలో కనిపించే అన్ని తలంపులు, ఆలోచనలు కూడా, మనిషి గుణాలలోంచి పుట్టుకొస్తున్నాయి. గుణం లేకపోతే తలంపు రాదు. రజోగుణం ఉన్నవాడికి, రజోగుణ తలంపులు వస్తాయి. తమోగుణం ఉన్నవాడికి, తమోగుణ తలంపులు వస్తాయి. సత్వగుణం ఉన్నవాడికి, సత్వగుణ తలంపులు వస్తాయి. అంటే మీకు ఎటువంటి తలంపులు వస్తున్నాయో, దానిని బట్టి మీ గుణం ఎటువంటిదో చెప్పవచ్చు. గుణాలలోంచే తలంపులు వస్తున్నాయి, అందుచేత మీకు వచ్చే తలంపును బట్టి మీ గుణం ఎటువంటిదో చెప్పవచ్చును. మీకు సృష్టిలో కనిపించే ఆలోచనలు అన్నీ మనుషుల గుణాల నుంచే వస్తున్నాయి. గుణాలు మారకుండా, తలంపులు, ఆలోచనలు, ఊహలు మారవు. ఎవడైతే తన గుణాన్ని తాను

మార్చుకోలేడో, వాడి తలంపులు కూడా మారవు. సత్వగుణం మీకు ఉన్నట్టు గుర్తు ఏమిటంటే, నా స్వార్థం తోటి నేను పోరాడుతూ ఉంటే, నా స్వార్థం బయటికి తీసివేయటం కోసం నేను సాధన చేస్తూ ఉంటే, నేను సత్వగుణంలో ఉన్నట్టు. కానీ నా స్వార్థాన్ని పోగొట్టుకోవటానికి నేను దేవుడిని ప్రార్థించటం లేదు, నా స్వార్థాన్ని పెంచమని ప్రార్థిస్తున్నాను. నా స్వార్థాన్ని అలంకరించమని ప్రార్థిస్తున్నాను, అది రజోగుణం, తమోగుణం. తమోగుణం ఉన్నవాడు భక్తుడే, రజోగుణం ఉన్నవాడు భక్తుడే, సత్వగుణం ఉన్నవాడు భగవంతుని భక్తుడే. అయితే రజోగుణం తమోగుణం ఉన్నవారు లోకంలో ఉన్న వస్తువులని అడుగుతారు. సత్వగుణం ఉన్నవాడు లోకంలో ఉన్న వస్తువులు అడగడు. నా స్వార్థాన్ని తొలగించు, నా స్వార్థాన్ని బయటికి తియ్యి. నిన్ను నన్ను వేరు చేసేది నా స్వార్థమే కదా, నువ్వు వేరు, నేను వేరు అనే భేదబుద్ధి కలగటానికి నాలో ఉన్న స్వార్థమే కారణం. నీకు నాకు ఏది అడ్డు వస్తోంది, నీలో నన్ను కలుపుకోవటానికి ఏది అడ్డు వస్తోంది, నా స్వార్థం అడ్డు వస్తోంది, అందుచేత నా స్వార్థాన్ని బయటికి తియ్యి. నిన్ను నన్ను వేరు చేసేది నాలో ఉన్న స్వార్థమే కదా! మీ హృదయంలోంచి ఈశ్వరానుగ్రహం అనే పొంగు, ఈశ్వరుని కరుణ వచ్చినప్పుడు, ఈశ్వరుని యొక్క ప్రేమ మిమ్మల్ని ముంచినప్పుడు, మీ స్వార్థం అనే రాయి బయటికి కొట్టుకుపోతుంది. అదే జ్ఞానం, అదే మోక్షం, అదే సిద్ధి. దేవుడు ఉన్నాడు, నేను ఉన్నాను అని దేవుడిని నన్ను వేరుచేస్తున్నది ఏమిటి అనే ప్రశ్న మీకు ఎప్పుడైనా వచ్చిందా?

సాధన అంటే ఏమిటి? నా ఆరోగ్యం బాగుపడాలని, నాకు ధనం కావాలని, నాకు కీర్తి కావాలని వీటి కోసమా సాధన? అసలు దేనికోసం మీరు సాధన చేస్తున్నారు? ఏ మనిషి అయినా మీ స్వార్థాన్ని ముట్టుకుంటే ఊరుకుంటారా? మీ (స్వార్థాన్ని కదుపుకోవటానికి ఎప్పుడైనా ప్రయత్నం చేసారా?) స్వార్థాన్ని తొలగించుకోవటానికి ఎప్పుడైనా ప్రయత్నం చేసారా? అది ఒక సత్వగుణం ఉన్న వాడికే సాధ్యం. సత్వగుణం లేని వాడికి అసలు దారే కనబడదు. భగవాన్ ఒక మాట చెప్పారు చాలామంది ప్రయత్నం చేసేది భగవంతుని తెలుసుకోవటానికి కాదు, భగవంతుని పొందటానికి కాదు, భగుంతుడిని మింగుదామని చూస్తారు. మన

స్వార్థాన్ని, మన అజ్ఞానాన్ని, భగవంతుడు మింగుదామని చూస్తే మనం ఒప్పకోము అటండీ! ఎందుకంటే మనం భగవంతుడిని మింగుదాం అని చూస్తున్నాము. భగవంతుడిని మింగుదామని మనం ప్రయత్నం చేస్తుంటే ఆయన చేతికి మనం ఎందుకు దొరుకుతాము?

మనం ఒంటరిగా కూర్చున్నాము ఎవరూ మనలను చూడటం లేదు అనుకొంటాము. కాని ఈశ్వరుడు చూస్తున్నాడు, అది మరిచిపోతాము. ఒక పెద్ద మనిషి ఎవరూ లేకుండా చూసి నాన్నగారితో ఇన్నాళ్ళూ మీరు చాలా పెద్దవారని అనుకొన్నాను, కానీ ఇప్పడు చాలా చిన్న వాళ్ళు అనుకొంటున్నాను. మీ ఆశ్రమం కట్టడంలో చిన్న చిన్న అభిప్రాయభేదాలు వచ్చాయట కదా మీకు. చిన్నవాళ్ళు కాబట్టి చిన్న చిన్న గొడవలకి కూడా పేచీలు పెట్టుకొంటున్నారు అన్నాడు ఆ పెద్దమనిషి. పెద్ద పెద్ద భావాలని, భగవాన్ చెప్పిన భావాలని, కృష్ణుడు చెప్పిన భావాలని, ఇంత చిన్న వాళ్ళు అయిన మీరు ఎలా ఇముడ్చుకోగలరు అన్నాడు. మీలో మీకు ఏదైనా తలంపులలో తేడా వస్తే, మీ తలంపులనే మింగలేకపోతే ఇంక మీ అహంకారాన్ని ఎలా మింగుతారు? మీరు పెద్దవాళ్ళు ఎలా అవుతారు? మీరు చిన్నవాళ్ళు కాబట్టే మీ తలంపుల్ని, మీ భేదాలని, మీ అభిప్రాయాలని మీరు మింగలేకపోతున్నారు అన్నాడు. మీరు నిజంగా పెద్దవాళ్ళయితే ఏనాడో వీటిని మింగేసి ఉండేవారు, ఇది ఏనాడో పూర్తి అయిపోయేది అన్నాడు, వాడు మనకు గురువు.

ఒక్కోసారి, పెద్ద పెద్ద విషయాలు మన బుర్రలకి అందుతాయి కానీ జీవితంలో చిన్న చిన్న విషయాలని అర్థం చేసుకోలేము. ఇదే సృష్టి రహస్యం. ఒకోసారి ఏ కృష్ణుడు చెప్పిన మాటలో మనకి అర్థం అవుతాయి, అటువంటి కృష్ణుడి మాటలే, అదే సత్యం చిన్న పిల్లల నోటివెంట వస్తే, మనకి అర్థం కాదు. అంటే కొంతమంది మనుషులు ఎలా ఉంటారంటే, పుట్టినవాళ్ళు పుట్టినట్టే చచ్చిపోతారు, కానీ ఎదగరు, పుట్టినవాళ్ళు పుట్టినట్టుగానే ఉండిపోతారు వంద ఏళ్ళు వచ్చినా సరే! మనుషులు ఎదగకుండా అలాగే చచ్చిపోతారు. మీ స్వార్థం తోటి మీరు పోరాడాలి అని మీకు తెలిస్తే నిజంగా మీరు సాధన చేస్తారా? ఇది మీరు బాగా ఆలోచించుకోండి. మీ స్వార్థంతోటే మీరు పోరాడవలసిన రోజు వస్తుంది ఈ భక్తి మార్గంలో

అని మీకు తెలిస్తే ఇప్పుడే భక్తిని వదిలేస్తారేమో!

ఏ పని చేసినా, ఏ తలంపు వచ్చినా, భగవంతుని ప్రీతి సంపాదించటం కోసం చేయండి. గొప్పలకోసం చేయకండి. గొప్పల వల్ల చివరికి మిగిలేవి తిప్పలు. భగవంతుని ప్రీతి కోసం చేయండి. భగవంతునికి ప్రీతి కలిగితే, ఆయన చేతిలో ఉన్న మోక్షం మీకు అందిస్తాడు. ప్రపంచంలో ఏ పని చేసినా భగవంతుని సంతోషం కోసం చేయండి. మీరు చేసే పనికి లోకంలో ఎవరూ సంతోషించకపోయినా, భగవంతుడు సంతోషిస్తే చాలు మీకు మోక్షం ఇచ్చేది భగవంతుడు. మీ స్వార్థం సంతోషించే పనికాదు చేయవలసింది. భగవంతుడు సంతోషించే పని చేస్తే మీకు మోక్షం వస్తుంది. మనం ముడులు వేయటం నేర్చుకొన్నాం, విడదీయటం నేర్చుకోలేదు. ఇప్పుడు విడదీయటం నేర్చుకోవాలి. ఎనాలిసిస్, విడదీయటం నేర్చుకుంటే జ్ఞానం వచ్చేస్తుంది.

లోకంలో చూడటానికి ఏముంది? ఒక విషయం గుర్తుంచుకోండి - నిజంగా ఆత్మ లేదనుకోండి, భగవంతుడు లేదనే చెప్పేవాడు. మరణించిన తరువాత మనం బూడిద అయిపోతాం అనుకోండి, మరణించిన తరువాత జీవితం లేదనుకోండి, లేదనే చెప్పేవాడు భగవంతుడు. భగవంతుడికి అబద్ధం చెప్పాల్సిన పని లేదు. భగవంతుడు అబద్ధాలు చెపుతున్నాడు అని ఏమైనా మీకు మనస్సులో ఉందా? భగవంతుడు చెప్పే మాటలు నిజం అని మీరు అనుకొంటూ ఉంటే, ఎందుకు మీ మనస్సు నమ్మటం లేదు? అది ట్రిక్కులు చేస్తోంది, లోపల గంతులు వేస్తోంది. కోతి గంతులు వేసినట్టు మనస్సు గంతులు వేస్తోంది. ఇది మన మనస్సు చేసే చమత్కారం, భగవంతుడు చెప్పిన మాటలు నిజంగా మన మనస్సు నమ్మటంలేదు. భగవంతుడు చెప్పిన ప్రతీ మాటా నిజం అన్న విషయం మన మనస్సు నమ్ముతోందా? నమ్మటం లేదు! ఏమీలేదండీ చచ్చిపోతే బూడిదేనండీ, ఇంకేమీ లేదండీ చూస్తున్నాము కదా! ఇదంతా బూడిదే, ఇవన్నీ కల్పించిన గొడవలండీ అంటున్నారు. మరి నిజంగా ఇవన్నీ కల్పితమైతే, చనిపోయిన తరువాత బూడిద అయితే, బూడిదే ఇంకేమీ లేదు అని భగవంతుడు చెప్పి ఉండేవాడు. మీ గుండెల మీద చెయ్యి వేసుకోండి, నిజంగా మీరు

నమ్ముతున్నారా భగవంతుడు చెప్పిన మాటలు? ఒకవేళ నమ్మటానికి ప్రయత్నం చేస్తుంటే మీ మనస్సు నమ్మనిస్తుందా? ఏమీ లేదండీ మరణానంతరం జీవితం లేదు, బూడిదే అంటారు కొంతమంది. అదే నిజమైతే, అదే చెప్పి ఉండేవాడు భగవంతుడు. అది నిజం కాదే! మీ ఇంటిలో కానీ వీధిలో కానీ మీరు చెప్పే మాటలలో ఎన్ని మాటలు మీరు త్రికరణశుద్ధిగా చెపుతున్నారు? సోదరమహాశయులారా! మీరు మాట్లాడే మాట్లలో త్రికరణశుద్ధి లేకపోతే, సత్యం లేకపోతే, యదార్థం లేకపోతే, భగవంతుడు చెప్పే మాటలు కూడా ఇటువంటి మాటలే అని మీరు అనుకొంటున్నారా? సాధనలు, దైవాలు, లోకాలు మాట అటు ఉంచండి. భగవంతుడు చెప్పే మాటలు మీ మనస్సు నమ్ముతోందా లేదా మీరు ఇంటికి వెళ్ళిన తరువాత అడగండి. మీ మనస్సుని మీరే అడగండి - నువ్వు నమ్ముతున్నావా లేదా అని మీ మనస్సుని అడగండి. నువ్వు నమ్ముతున్నావా లేకపోతే నమ్మినట్టు నటిస్తున్నావా?

మన తలంపులు, మన పనులు అన్నీ దేహం చుట్టూ తిరుగుతున్నాయి. మన దేహం కోసం ఇంత కష్టపడుతుంటే దీన్ని కాల్చేటప్పడు నన్ను ఎందుకు కాలుస్తున్నావు అని కూడా అడగదు. మీ దేహమే కనుక నిజం అయితే, మీ నిద్రలో ఇది ఎక్కడ ఉంది? దీనితో సంబంధం లేకుండా మీరు ఎక్కడ ఉంటున్నారు? ఈ రాత్రి మీరు ఆలోచించండి. నిద్రలో మీరు ఎక్కడ ఉంటున్నారు. రాత్రి ఏమీ కలలు రాలేదు, ఏమీ గొడవలు లేవండీ, రాత్రి బాగా నిద్ర పట్టింది అని చెప్పేది ఎవరు? అప్పడు తలంపులు ఆలోచనలు లేవే, లోకాలు దేవతలు లేరే, మీ ఆలోచనలు ఏమీ లేవే, మీరు ఎక్కడ ఉన్నారో మీకే తెలియదే! అప్పడు కూడా మీకు స్వప్నాలు రాలేదు, బాగా నిద్ర పట్టింది అని ఎవరూ చూడకపోతే మీకు ఎవరు చెపుతున్నారు ఆ విషయం? ఆ చూసేవాడు ఎవడు? మీరు నిద్రలో దేహం లేకుండా ఉంటున్నారు కదా, మరి మీకు మరణించేటప్పడు మీకు ఎందుకు భయం వేస్తోంది. మరి నిద్రలో దేహంతోటి సంబంధం లేకుండా ఎలా ఉంటున్నారు? నిద్రలో మీరు దేహం లేకుండా, దేహం తోటి సంబంధం లేకుండా, సుఖంగా ఉంటున్నారు. కానీ మరణం వచ్చినప్పడు దేహంతోటి సంబంధం తెగిపోతుంది అంటే మీకెందుకు భయం వేస్తోంది, నిద్ర అంటే మీకు

ఎందుకు భయం వేయటం లేదు?

జీవితంలో మనకి అవసరమైన దేనినీ వాయిదా వేసుకోవడం లేదు. ఈవేళ సాయంత్రం తినే అన్నం రేపొద్దున్న తిందాం అని వాయిదా వేసుకోము. ఒక్క ఆత్మని తెలుసుకునే ప్రయత్నాన్ని వాయిదా వేసుకొంటాము. నేను ఎవడినో తెలుసుకునే ప్రయత్నాన్ని ఒక్కటే వాయిదా వేసుకుంటాము కానీ దేహానికి సంబంధించిన అవసరాలు దేనినీ వాయిదా వేసుకోము. ఇదే జీవితం యొక్క రహస్యం! నేను ఎవడినో నేను తెలుసుకోవటానికి ఎందుకు వాయిదాలు వేసుకొంటున్నాను? నా ఆలోచనలో నిదానం లేదా, నాకు ఏకాగ్రతలో లోపం ఉందా? అన్ని దానాలలోకి నిదానం గొప్పది. అన్నదానం కంటే, వస్త్రదానం కంటే, నిదానం గొప్పది. ఈ నిదానం నా ఆలోచనలో ఉందా? ఈ నిదానం లేనప్పుడే తొందర మాటలు వస్తాయి, తొందర పనులు చేస్తాము. చిన్నప్పుడు ఆటలతోటి గడిచిపోయింది. వయస్సు వచ్చినప్పుడు సంసారం గొడవలు, ముసలివాళ్ళం అయ్యాక పూర్వం ఇంత గొప్ప అంత గొప్పగా బ్రతికాం అని పురాణం కబుర్లు. తరువాత వల్లకాటికి సిద్ధం. దేవుడు ఎవరికి కావాలి? డబ్బు, పేరు సంపాదించాలి, గొప్పవాళ్ళమని అనిపించుకోవాలి. ఇంక దేవుడి గొడవ ఎప్పుడంటే, ముసలివాళ్ళం అయిపోయిన తరువాత! శరీరం, మనస్సు నా స్వాధీనంలో ఉండగా, నాకు ఆరోగ్యం బాగా ఉండగా డబ్బు, పదవులు, గొప్పలు వీటి గొడవలే. శరీరం వడిలిపోయిన తరువాత, కాళ్ళు నా కూడా రావటం మానేసాక, ఇంద్రియాల పటుత్వం తగ్గిపోయాక, అప్పుడు మనకి దేవుడి గొడవ. అన్నీ పోయాక దేవుడా? అంటే తెలివితక్కువ వాడు ఎవడు అంటే, దేవుడు అన్నమాట! భగవంతుడిని మనం మోసం చేయలేము. మనకి ఉన్న తెలివితేటలు కూడా దేవుడికి లేవనుకొంటున్నారేమో! ఏ జీవుడిని ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఉంచాలో ఇంత సృష్టి నడుపుతున్న ఈశ్వరుడికి మీకున్న తెలివితేటలు కూడా లేవు అనుకొంటున్నారా? భగవంతుడు కనుక సర్వజ్ఞుడు కాకపోతే ఇది అంతా ఎలా చేస్తున్నాడు? అందుచేత మనం సాధన విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | | |
|---|---|---|
| ఏప్రిల్ | 6 | ఉగాది - మధ్యాహ్నం గం॥ 2-00లకు భక్తులచే ప్రవచనములు |
| ఏప్రిల్ | 13 | శ్రీరామ నవమి - మధ్యాహ్నం గం॥ 1-00లకు అమలాపురం మాష్టారి ప్రవచనం |
| మే | 9 | శంకర జయంతి - మధ్యాహ్నం గం॥ 1-00లకు హైదరాబాద్ అరుణగారి ప్రవచనం |

**SRI RAMANA KSHETRAM A/c. No. 510101006497273**
**Corporation Bank, Palakol Branch, IFSC Code : CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174**
**For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502**

## ఆరాధన

భగవాన్ శ్రీరమణమహర్షి ఏప్రియల్ 14, 1950 శుక్రవారం రాత్రి 8-47 ని॥లకు అరుణాచల క్షేత్రంలో తన శరీరాన్ని విడిచిపెట్టారు. శాశ్వత, పరమశాంతి ధామంలో ఐక్యం అయ్యారు. అదే మహానిర్వాణం. అప్పుడు భక్తులు అరుణాచలశివా! అంటు పాడుతున్నారు. ఆ క్షణాన ఒక దివ్యకాంతి భగవాన్ ఉన్న గదిని ఆనుకొని పయనిస్తూ, అరుణగిరిలో ఐక్యం అయింది. భగవాన్ దేహధారిగా ఈ భూమిమీదకు వచ్చిన పని పూర్తి అయింది, తాను శాంతిగా నిష్క్రమించారు. తిరుచ్చుళిలో దేహాన్ని ధరించి, మధురైలో అమృతానుభవమును పొంది, ఆతరువాత ఏబదినాలుగు సంవత్సరములు జీవన్ముక్తునిగా అరుణాచలంలో సంచరించి, జీవకోటిని అంతిమసత్యంలోకి మేల్కొలిపారు. వ్యవహారిక సత్యమైన శరీరము ఇప్పుడు లేదు, కాని పరమఉనికిగా భగవాన్ నిరంతరం ఉన్నారు. ఆయన అనంతుడు కాబట్టి రాకపోకలు లేవు. గురువును ఒక దేహముగాను, నామముగాను, రూపంగాను చూస్తే ఆ పొరపాటు మనదే! 1948 సంవత్సరము చివరి భాగములో, భగవాన్‌కి ఎడమచేతి పైభాగమున కేన్సరు సోకింది. ఆ సందర్భములో భగవాన్ "శరీరమే ఒక వ్యాధి, ఆవ్యాధికి మరొక వ్యాధి వచ్చింది, దానికి నివారణ మార్గం చూడాలి కాని, ఉపశమనం వెదుకనేల?" అనేవారు. దేహము మరణించిన తరువాత మనము ఉండము అని భావిస్తాం! గాఢనిద్రలో మనకు దేహముతోటి, లోకముతోటి, దేముడితోటి, సంబంధము లేదు, కాని అప్పుడు 'తాను' లేకుండా పోయాడా? ఉన్నాడు. కాబట్టి వాస్తవముగా తాను ఎవరో అనుభవైకవేద్యం అయ్యేవరకు దుఃఖం వెంటాడుతుంది. మనకు తెలుసున్నా, తెలియకపోయినా 'నేను' అంటే ఆత్మ. భగవాన్ శ్రీరమణుని అరుణాచల ఆగమనం, ఆయన బోధ, ఆయన జీవిత విధానం, ఆయన సమత్వం, మనకు అర్థమైతే దేహాత్మబుద్ధి నుండి విడుదలపొంది తీరుతాం!

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

# అందం మంచి నడవడికలో ఉంటుంది కాని - ఆడంబరంలో కాదు

అహంకారం ఆడంబరంలో బ్రతుకుతుంది. పట్టుబట్టలతో దండలతో బొట్లతో భేషజాలను ప్రదర్శించి గుడికి వెళుతుంది. తన అందాలు చూచి అందరూ మురిసిపోవాలని కాని భగవంతుడు చూచేది మంచి నడవడికలో ఉన్నాడా! అనేది ఆయన దృష్టిపథంలో ఉంటుంది. మనకు తెలిసినా తెలియకపోయినా మనం అనుకొన్నా అనుకోకపోయినా మన జీవితం మనం కోరుకున్నవిధంగా ఉండదు, జరుగదు. ఎందుచేతనంటే మన జీవితం వెనుక జీవించేవాడు ఒకడు ఉన్నాడు. ఈ జీవితం ఈశ్వరునిది. ఈ జీవితం ద్వారా చేసే ప్రతీ పనీ ఆయనది. ఏ ఫలితం వచ్చినా నేను ఎందుకు వ్యాకులపడాలి? ఎలా జరగాలో ఈశ్వరుడు జరిపిస్తాడు. ఏది జరగకూడదో ఆయనకు తెలుసు గనుక జరుగనివ్వరు అనే భావనతో మనం ఏ పని చేసినా ప్రతీ పనీ ఆయనదే అవుతుంది. అంటే భగవంతుని పనిలా చెయ్యాలి. ఫలితం కూడా ఆయన చేతిలోనిదే. పని చెయ్యటం మన కర్తవ్యం. అదే ఈశ్వరార్పణ బుద్ధి. అదే మంచి నడవడిక. భగవంతుని రూపంలో ఉన్న ఈ సృష్టి మీద రాళ్ళు విసిరితే మనం ఆ రాళ్ళనే తిరిగి పొందుతాము. మనం పూలను విసిరితే మరిన్ని పూలు మన దగ్గరకు వస్తాయి. ఒకడు ఈ దృష్టి కలిగి ఉంటాడు ఆత్మను నేనే అదే ఈ లోకం. నా ఆడంబరంతో కూడి అహంకారం నశించగానే అదే నేను అవుతాను. నేను నిత్యుణ్ణి, శాశ్వతుణ్ణి ఇలా భావించిన పుణ్యసంస్కారుల నడక అంతా మంగళప్రదమైనదే. వాడు నన్ను తిట్టాడు, నన్ను కొట్టాడు, నన్ను జయించాడు, నన్ను త్యజించాడు అని మదనపడే వాని వైరం నశించదు. వైరం వైరం వల్ల నశించదు. భగవంతుని కళ్యాణగుణమైన ప్రేమించటం వల్లనే అది సమిస్తుంది. ఏ పని జరిగినా ఒకరు కారణం అని అనుకోకూడదు. మనపై ఇతరులు అసూయాపరులై నిందించవచ్చు, విమర్శించవచ్చు. అప్పుడు మనం కలతతో కుళ్ళిపోకూడదు. కారణం మనకు అపాయం కలిగిస్తున్న ప్రయత్నిస్తున్న వారిని దయతో అనన్యగా సంభావించాలి. ఆ శత్రువులు మన ఆత్మ స్వరూపులే. గర్వాన్ని అహంకారాన్ని మహాత్ములు ఆమోదించరు. వినయం, నమ్రతలతో నిండిన వారి మీద పరమాత్ముడు తన కృపను కురిపిస్తాడు. నీరు అహంకారమనే పర్వత శిఖరంపై నిలువదు. వినయం అనే పల్లపు ప్రదేశంలోనే నిలుస్తుంది. ప్రతీ మనిషిలోనూ జ్ఞాపకాలు అనే ఇల్లు ఉంటుంది. అదీ ఆవరణదోషం, మలదోషం, విక్షేపదోషం. ఈ ఇల్లు ధ్వంసం అయితే కానీ సత్యం తెలియదు. మానవుల్లో ఎక్కువ మంది యాంత్రిక అలవాట్లకు బానిసలు అవుతారు. ఇనుమును మరలా మరలా కరిగించి మూసలో పోసినట్లే ఆడంబర జీవి మళ్ళీ మళ్ళీ జన్మలు ఎత్తుతూ ఉంటాడు. గురువు తెలిపే అడుగు జాడల్లో నడిచేవారికి శాశ్వత శాంతిని పొంది తరిస్తారు.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**